# చెన్నారావుపేట ఎస్సై బదిలీ

చెన్నారావుపేట, డిసెంబర్ 13 : వరంగల్ జిల్లా చెన్నారావుపేట ఎస్సై మహేందర్‌పై బదిలీ వేటు పడింది. వీఆర్‌కు బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో బుధవారం కొందరు చెన్నారావుపేటలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మహేందర్ స్థానంలో శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ పలు ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్సై మహేందర్ ఆకస్మాత్తుగా బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆయన ట్రైనింగ్ పీరియడ్ పూర్తికావడంతో మరో ట్రైనింగ్ ఎస్సైకి అవకాశం కల్పించడానికి మహేందర్ బదిలీ జరిగిందని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివాదాలు, అవినీతి ఆరోపణలు ఎస్సై మహేందర్ బదిలీకి దారి తీశాయని లోకల్‌గా ప్రచారం జరుగుతోంది. మహేందర్ చెన్నారావుపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే ఇక్కడి ఉప్పరపల్లి గ్రామ శివారులోని జీడిగడ్డతండాలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అనుమానితుడిగా భావించి ఎస్సై మహేందర్ ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ తర్వాత ఆ వ్యక్తికి హత్యతో సంబంధం లేదని తేలింది. దీంతో ఎస్సై మహేందర్ తనను అకారణంగా కొట్టారని, తాను అనారోగ్యం పాలైనట్లు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇదిలాఉంటే రేషన్ బియ్యం, గుడుంబా బెల్లం వ్యాపారుల నుంచి మహేందర్ నెలనెలా ముడుపులు గుంజారని, ప్రతినెల పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సబ్సిడీ రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కొద్దినెలల క్రితం చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ విజేందర్, స్థానికుడు చెన్నారెడ్డిపై ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విజేందర్, చెన్నారెడ్డిపై రౌడీషీట్ కూడా ఓపెనైంది. ఇదే సమయంలో ఎస్సై మహేందర్ అవినీతికి పాల్పడుతున్నారని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఇటీవల ఎన్నికల ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘించారని నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పాటు మరికొందరిపై పీఎస్‌లో కేసు నమోదైంది. ఎస్సై మహేందర్ ఉద్దేశ్యపూర్వకంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకొని ఈ కేసు నమోదు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్దిరోజులకే ఎస్సై మహేందర్ బదిలీ కావడం చర్చకు దారి తీస్తోంది.

# పురుగుల మందు తాగిన దంపతులు

- చికిత్సపొందుతూ భర్త మృతి
- భార్య పరిస్థితి విషమం


మృతుడు దరావత్ వీరన్న (ఫైల్)

కేసముద్రం, డిసెంబర్ 13: పంటల సాగుతో నష్టం వాటిల్లగా అప్పులు తీర్చలేమని మనస్తాపం చెందిన దంపతులు పురుగులమందు తాగారు. చికిత్సపొందుతూ భర్త మృతిచెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని క్యాంపు తండాకు చెందిన దరావత్ వీరన్న(40), లలిత దంపతులకు యాకేష్, వికాస్ కుమారులు. వారసత్వంగా వచ్చిన మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎకరన్నరలో మిర్చి, ఎకరంలో పత్తి సాగుచేశారు. మిర్చికి గుబ్బ రోగం రాగా పంట కాపాడుకోవడానికి వేలాది రూపాయలు అప్పులు తెచ్చి మందులు పిచికారి చేశాడు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మరోవైపు పత్తి దిగుబడి తగ్గింది. మిగ్‌జాం తుఫాన్‌తో చేతికి అందివచ్చిన వడ్లు వర్షానికి తడిసి మొలకెత్తింది. మిర్చి, పత్తి, వరి పంటల పెట్టుబడికి సుమారు రూ.3లక్షల వరకు అప్పులు తెచ్చారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు తీర్చలేమని తీవ్ర మనస్తాపం చెందిన దంపతులు ఈనెల 8న మిర్చి తోట వద్ద పురుగులమందు తాగారు. గమనించిన పలువురు రైతులు చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. వీరన్న పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ అతడు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మహబూబాబాద్‌లో చికిత్స పొందుతున్న లలిత పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తండ్రి లచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## యువతి ఆత్మహత్య

భీమదేవరపల్లి, డిసెంబరు 13: మండలంలోని ధర్మారంలో చెప్యాల హరిప్రియ (25) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి ఆనందం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో ప్రీమియర్ కళాశాలలో రెండు సంవత్సరాలు నర్సింగ్ చేసింది. ఆరోగ్యం బాగా లేక ఆరునెలల క్రితం ఇంటికి వచ్చింది. ఐదేళ్లుగా ఇదే గ్రామానికి చెందిన రాజేష్, హరిప్రియ ప్రేమించుకుంటున్నారు. రాజేష్ పెళ్లికి నిరాకరించడంతో హరిప్రియ మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకున్నది. తన కూతురు హరిప్రియ చావుకు కారణమైన రాజేష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆనందం కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నండ్రు సాయిబాబు తెలిపారు.

# సైన్స్‌ఫేర్‌తో విజ్ఞానానికి పదును

- జిల్లా వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు
- విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం
- ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయికి ఎంపిక


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

గిర్మాజీపేట, డిసెంబర్ 12: బాలలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుంది. తద్వారా విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదును పెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సాహమందిస్తున్నది. ఈ నెలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శన నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులు పాల్గొని వారి మెదడుకు పదును పెట్టనున్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన ప్రయోగాలను (ఎగ్జిబిట్లు) రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు.

### మార్కులు ఇలా...

ఒక్కో ప్రదర్శనకు వంద మార్కులు కేటాయించారు. విద్యార్థి సొంతంగా తయారుచేసి ఊహించి రాస్తే 20 మార్కులు, సైన్స్, గణిత భావనలు స్పష్టంగా కనిపిస్తే 15 మార్కులు, సైంటిఫిక్(ప్రయోగ) సూత్రానికి 15 మార్కులు, ప్రయోగం తయారు చేసే విధానం కోసం 15 మార్కులు, సమాజానికి ఉపయోగపడేలా వినియోగించుకునేలా ఉంటే 15 మార్కులు, తక్కువ ఖర్చుతో లాభదాయకంగా ఉంటే 10 మార్కులు, ప్రయోగం వివరించే విధానానికి 10 మార్కులు కేటాయిస్తారు. గ్రామీణ, గిరిజన, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు 5 శాతం, పట్టణ పరిధిలోని విద్యార్థులకు 3 శాతం వెయిటేజీ కేటాయిస్తారు.

### ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాల్సిన అంశాలు

1. ఆరోగ్యం, లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్), అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, కంప్యూటేషనల్ థింకింగ్

### వేర్వేరుగా ప్రదర్శనలు...

ఐదు ఉప అంశాలతో పాటు నూతన ఆవిష్కరణకు సంబంధించిన ఏవైనా ప్రయోగాలను ప్రదర్శించవచ్చు. 6 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ విభాగంగా, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగంగా పరిగణించనున్నారు. ఈ ప్రదర్శనలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వారు చేసిన ఎగ్జిబిట్లను ప్రదర్శించవచ్చు. అలాగే, విద్యార్థులతో పాటు సైన్స్, గణితం, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, డీఈడీ, బీఈడీ శిక్షణ పొందుతున్న వారు, బోధన ఉపకరణాలు అనే అంశంపై ప్రయోగాలను ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ప్రయోగాలు ప్రదర్శించడానికి అధికారులు ఏర్పాట్లు చేయడంలో సన్నద్ధమవుతున్నారు. స్వయంగా తయారు చేసిన వాటినే అనుమతిస్తారు. రెడీమేడ్ నమూనాలను అనుమతించబడవు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన ప్రయోగానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇక విద్యార్థితో పాటు ఒక గైడ్ టీచర్ మాత్రమే ఒక ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొనాలి. అలాగే, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు ఇన్‌స్పైర్ ప్రదర్శనను కూడా నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో 121 మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

### మేధా సంపత్తిని వెలికితీసేందుకే సైన్స్‌ఫేర్



విద్యార్థుల్లో మేధాసంపత్తిని వెలికితీసేందుకే సైన్స్ ఫేర్ దోహదపడుతుంది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించాలి. అందుకు పాఠశాలల హెచ్‌ఎంలు కృషిచేయాలి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాలలోని విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి.

– జిల్లా విద్యాశాఖాధికారి డీ వాసంతి


శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

## గ్రేటర్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తాం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 13: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపుపొందిన ఎమ్మెల్యేలను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జర్నలిస్టులతో ఎల్లప్పుడూ స్నేహ సంబంధాలు కొనసాగుతాయన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ కోశాధికారి అమర్, వైస్ ప్రెసిడెంట్లు జీ శ్యాం, బీ శ్రీనివాస్, అల్లం రాజేశ్‌వర్మ, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్, వీ సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు వీ హరీశ్, డీ శ్రీకాంత్, ఆంజనేయులు, నయీం పాషా, వేణుగోపాల్, ఎం రాజు పాల్గొన్నారు.

## పీసీకి పోలీసు అధికారుల అభినందన

సుబేదారి, డిసెంబర్ 13: అంతర్రాష్ట్ర చోరీలకు పాల్పడిన దొంగల సమాచారాన్ని తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులకు అందించి నిందితులను పట్టించిన మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అలీని ఆయా రాష్ట్రాల పోలీసు అధికారులు అభినందించారు. గురువారం కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా,కానిస్టేబుల్ అలీని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఛత్తీస్‌గఢ్ కోటావలి పీఎస్ పరిధిలో రూ.14లక్షల చోరీకి పాల్పడిన దొంగల సమాచారం, తమిళనాడు ఈరోడ్ పీఎస్ పరిధిలో 800 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన వారి సమాచారాన్ని సీసీ కెమెరాల ద్వారా జాతీయ స్థాయి క్రైమ్ వాట్సాప్ గ్రూప్‌లో ఆయా రాష్ట్రాల పోలీస్ అధికారులు పంపించారు. ఈ సమాచారంతో అక్కడి పోలీసులు దొంగలను పట్టుకున్నారు.

# దాడి ఘటనలో గాయపడిన యువకుడి మృతి

**వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన బాధితుడు**


రాకేశ్(ఫైల్)

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 13: అర్ధరాత్రి యువకుడిపై దాడి చేసి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దారి దోపిడీకి పాల్పడిన వ్యక్తుల చేతిలో తీవ్రంగా గాయపడి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కథనం ప్రకారం.. కాశీబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఎక్కలి రాకేశ్(23) తండ్రి చనిపోవడంతో క్యాటరింగ్ సర్వీస్ పనులు చేసుకుంటూ తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 4న రాత్రి ఒంటిగంట సమయంలో హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పని పూర్తి ముగించుకొని తనతోపాటు క్యాటరింగ్ సర్వీస్ పనులకు వచ్చిన మహిళతో కలిసి వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం ముందు నుంచి కాశీబుగ్గ సెంటర్‌కు వెళ్తున్న వీరిని ముగ్గురు యువకులు అడ్డుకొని సదరు మహిళను బెదిరించి పంపించారు. తన వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు (చైన్, ఉంగరాలు) ఇవ్వాలని రాకేశ్‌ను బెదిరించారు. అతడు అంగీకరించకపోవడంతో రాకేశ్‌పై బండరాయితో దాడి చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న రాకేశ్ నుంచి నగదు, బంగారు ఆభరణాలు తీసుకొని దుండుగులు పారిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న రాకేశ్‌ను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స పొందుతూ రాకేశ్ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బుధవారం ఉదయం ఇంతేజార్‌గంజ్ పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.


### పెట్రోలింగ్ లేకపోవడమే కారణం..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్ల జంక్షన్‌లో నిరంతరం పోలీసుల పర్యవేక్షణ అవసరమని, సరైన పెట్రోలింగ్ నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి దారి దోపిడీ ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం కూరగాయల మార్కెట్‌కు వచ్చిన రైతులు, దూరప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసి వస్తున్న వారిపై దాడులు జరిగిన సందర్భాలూ చాలానే ఉన్నాయని చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# నాగుర్లపల్లిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి

- ఒకేరోజు.. ఒకే వీధిలో మృత్యువాత
- గ్రామంలో 3 నెలల్లో 8 మంది మృతి!

నర్సంపేటరూరల్, డిసెంబర్ 13: ఒకేరోజు.. ఒకే వీధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి చెందిన ఘటన నాగుర్లపల్లిలో బుధవారం జరిగింది. గడిచిన మూడు నెలల్లో 8 మంది వివిధ కారణాలతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తనుగుల సాంబయ్య (62) అనారోగ్యంతో, అయిత రాజు (46) గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. వీరిద్దరూ ఒకే కాలనీకి చెందిన వారు. అయితే, మూడు నెలల్లో ఇదే గ్రామానికి చెందిన 8 మంది వివిధ కారణాలతో మృతి చెందారు. ఉన్నతాధికారులు, వైద్యులు తక్షణమే స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని నాయకులు బుర్రి సాగర్, తనుగుల శ్రీకాంత్, గొర్రె రాములు, మారపెల్లి రాజు, శ్రీరాము, మదాసి సరిత, బుర్రి సునీల్, చింటు, గ్రామస్తులు కోరారు.


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

## కాశీవిశ్వేశ్వర ఆలయంలో కుంకుమ పూజ

**పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు**

కాశీబుగ్గ, డిసెంబర్ 13: వరంగల్ కాశీబుగ్గ ప్రాంతంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు ఉదయం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకం, మధ్యాహ్నం చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఓరుగంటి కొమురయ్య, బొడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి, బండారి భాస్కర్, నాగమల్ల ఓంకారేశ్వర్, జంగం రాజు, ఉమాశంకర్ పాల్గొన్నారు.